



(ఇన్‌సెట్లో) సోమనాథుడి స్మృతివనం

పుడమికి ఆకుపచ్చ కోక కట్టినట్లు..

అక్కడి పరిసరాలు పూర్తిగా హరిత వర్ణం పూసిన పచ్చందాలతో ఊటీ, అరకును తలపిస్తున్నాయి. కనుచూపు మేర ఉన్న ఈ అందమైన పరిసరాలు ఆహ్లాదంగా కనువిందు చేస్తున్నాయి. సుమారు 4వేల ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాంతం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ క్షీరాద్రి దిగువన ఉన్నాయి. అలాగే పాల్కుర్కి సోమనాథుడి స్మృతివనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ దృశ్యాన్ని 'ఈనాడు' తన కెమెరాలో బంధించింది. – ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే పాలకుర్తి

ఎస్సైల బదిలీలు


వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వివిధ ఠాణాల్లో పనిచేస్తున్న నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

వీఆర్‌లో ఉన్న ఎస్‌కే. హమ్మద్‌ను బచ్చన్నపేటకు, అక్కడి ఎస్సై కె.సతీష్‌ను ఐటీ కోర్, మిల్స్‌కాలనీ ఠాణా ఎస్‌బీ అటాచ్‌లో ఉన్న బి.చందర్‌ను వర్ధన్నపేటకు, అక్కడి ఎ.ప్రవీణ్‌కుమార్‌ను కేయూసీకి బదిలీ చేశారు.

మహాత్ముడి మాట.. పూలబాట!

● పల్లెలు మురవాలి..
గాంధీజీ ఆశయం నెరవేరాలి
ఉయ్యాలో..

ఈనాడు, వరంగల్, కాజీపేట, న్యూస్‌టుడే



గ్రామాల అభివృద్ధి కోసం మహాత్ముడు కలలు కన్నారు.. పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలని తపించారు. గొప్ప వ్యక్తిత్వానికి మారుపేరుగా నిలిచిన ఆయన బోధనలు బతుకమ్మ పండగలోనూ కనిపిస్తాయి.. బతుకమ్మ అంటే జీవిత పండగ అని అర్థం. నిత్యం పంటలతో సుభిక్షంగా ఉంటూ వేడుకలా సాగాలని పార్వతిదేవిని మహిళలు వేడుకుంటారు. గాంధీ కోరుకున్నదీ పల్లెలు పచ్చగా ఉండాలనే. అందుకే బతుకమ్మ పండగలో గాంధీ ఆశయాలు కనిపిస్తాయి. అక్టోబరు 2 గాంధీ జయంతి.. మరోవైపు వైభవంగా జరిగే బతుకమ్మ పండగ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మహాత్ముడి ఆశయ సాధనలో ఆదర్శంగా నిలుస్తున్న ప్రకృతి పల్లెల గురించి కథనం..

ఆరుగుంటుపల్లి.. పారిశుద్ధ్యంలో ఆదర్శం

ఇంకుడుగుంతల నిర్మాణంలో ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఆరుగుంటుపల్లి గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామంలో 125 మంది జనాభా ఉండగా, 38 నివాసాలున్నాయి. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మించుకోవడంతో.. గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి వేసవిలో కూడా నీటి సమస్య రాలేదని స్థానికులు చెబుతున్నారు. ఎస్సై కిరణ్‌కుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఉపాధి హామీ పథకం ఏపీవో భవాని గ్రామస్థులకు సహకరించడంతో పరిశుభ్రతలో, వందశాతం ఇంకుడు గుంతలు నిర్మించుకున్న గ్రామంగా ఆరుగుంటపల్లి నిలిచింది. –న్యూస్‌టుడే, వాజేడు





ఠాణా మెట్లెక్కని.. మెట్లతిమ్మాపురం

పది దశాబ్దాల చరిత్ర గల ఆదివాసీగూడెం.. సత్యం.. ధర్మం అనే గాంధీజీ సిద్ధాంతాలతో ముందుకు సాగుతోంది. ఊరిలో ఎవరి మధ్యనైనా గొడవ.. ఘర్షణ జరిగితే పరిష్కారం కోసం ఇప్పటి వరకు ఠాణా మెట్లెక్కలేదు. ఎలాంటి సమస్యలు వచ్చినా గ్రామంలోని పెద్దలు చర్చించి సామరస్యంగా పరిష్కరిస్తారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రానికి 15 కి.మీ దూరంలోని అడవి మధ్యన ఉన్న **మెట్లతిమ్మాపురం** ప్రత్యేకత ఇది.. 130 కుటుంబాలు, 750 మంది జనాభా 412 మంది ఓట్లు కలిగిన ఈ గూడెం ప్రజల్లో కల్మషం, విద్వేషాలు ఏమాత్రం కనిపించవు. కలిసిమెలిసి జీవనం కొనసాగిస్తున్నారు. 'సమస్య పరిష్కారానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా.. గ్రామ పెద్దల మధ్యనైనా ఎక్కడైనా జరిగేది న్యాయమే. అందుకే గ్రామ పరువును కాపాడుకునేందుకు స్టేషన్‌కు వెళ్లకుండా ఇరువర్గాల వారు తీర్పును మెచ్చేలా పెద్దల సమక్షంలోనే పరిష్కరించుకుంటున్నాం. ఇది మా పూర్వీకుల నుంచి కొనసాగుతోంది. భవిష్యత్తులోనూ ఇదే విధానాన్ని కొనసాగిస్తాం అని ఊరి దొర బిజ్జ నర్సింహారావు, పటేల్ తాటి కృష్ణ వివరించారు.

● వ్యవసాయంపైనే ఆధారపడిన వీరు ఎక్కువగా వరి, మొక్కజొన్న, మిర్చి పంటలను సాగు చేస్తారు. వందశాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మించుకున్నారు. మురుగునీరు వీధుల్లో పారకుండా ఇంటింటా ఇంకుడు గుంతలను నిర్మించుకుని స్వచ్ఛతలో శెభాష్ అనిపించుకుంటున్నారు.

● గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన వ్యక్తులున్నా ఎక్కడా ఏ పార్టీ జెండాలు, స్తూపాలు, విగ్రహాలు, ఫ్లెక్సీలు కనిపించవు. సుమారు 15 ఏళ్ల నుంచి మద్యపాన నిషేధం అమలు చేస్తున్నారు. అమ్మకాలు చేస్తే రూ.10 వేల జరిమానా విధిస్తున్నారు.

అన్నింట్లో ఆదర్శం

గూడెం ప్రజలు వేలిముద్రలు వేయకూడదనే ఉద్దేశంతో సుమారు 32 ఏళ్ల కిందటనే అప్పటి పెద్ద రామయ్య కనీసం వారందరూ పేర్లు రాసేలా.. బస్సుల పేర్లు తెలిసేలా అక్షరాలు నేర్పించారు. ఆ తర్వాత అక్షరదీపం కార్యక్రమం కింద రాత్రిబడిలో ప్రతి ఒక్కరూ అక్షరాలు నేర్చుకొని 2005లో నాటి భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రశంసలు పొందారు.

● గ్రామస్థుల కోసం అభయ, 100 స్మైల్ ఫౌండేషన్ సహకారంతో గ్రంథాలయం ఏర్పాటు చేసినా కొత్తపుస్తకాలు ఇచ్చే వారు లేరు.

● డిగ్రీ, పీజీ, బీఈడీ, ఇంజినీరింగ్ చదివినవారు 45 మంది వరకు ఉన్నారు. టీచర్లు 13 మంది ఉన్నా ఇందులో పెళ్లి చేసుకొని అత్తారింటికి వెళ్లిన అమ్మాయిలున్నారు. పోలీస్, అటవీ శాఖ ఉద్యోగులు నలుగురున్నారు. ఇందులో ఒకరు మహిళా రిజర్వ్‌డు ఎస్ఐ ఉన్నారు.

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, బయ్యారం

పచ్చదనంలో నెల్లుట్ల ప్రగతి పథం



లింగాలఘనపురం, న్యూస్‌టుడే: పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని గాంధీజీ అన్న మాటలకు నిలువుటద్దంగా నిలుస్తోంది జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని నెల్లుట్ల గ్రామం. గత ప్రభుత్వం చేపట్టిన హరితహారం, పల్లె ప్రగతి పథకాలు గ్రామాన్ని ప్రగతి పథంలో నిలిపాయి. దేవాదాయ శాఖకు, గ్రామ పంచాయతీకి చెందిన 11 ఎకరాల్లో 65 వేల మొక్కలు నాటి నూరు శాతం పెంచారు. ప్రస్తుతం చిట్టడివిని తలపిస్తోంది. దీంతో ప్రగతి మెరిసి జాతీయ పురస్కారం దక్కించుకుంది. పచ్చదనానికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

మద్యనిషేధంతో మెరుగుపడుతున్న జీవన విధానం



లింగంపల్లి

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: బచ్చన్నపేట మండలం లింగంపల్లి గ్రామస్థులు 2024 ఆగస్టు 15న సంపూర్ణంగా మద్యం నిషేధించారు. గ్రామంలో దాదాపు 500 వందల గడపలుండగా, వ్యవసాయం, కూలీ పనులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసై పనులను విస్మరిస్తున్నారని.. పల్లెలోని పెద్దలు, యువకులు, సామాజికహితులు ఆలోచనచేసి నిషేధించాలని సంకల్పించారు. ప్రస్తుతం గ్రామస్థుల భాగస్వామ్యంతో అభివృద్ధిలో లీనమయ్యారని, ఎలాంటి వాగ్వాదాలు లేకుండా జీవనం సాగిస్తున్నారని, దీనిని మానడం వల్ల మనిషి ఆలోచనా విధానం కూడా మారుతోందని గ్రామ మాజీ సర్పంచి కుందెన మల్లేశం వివరిస్తున్నారు.

ఎంపీ నిధులు ఎక్కువ కేటాయించాలి..

కుమార్తెకు కడియం అభ్యర్థన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, చిత్రంలో ఎంపీ కావ్య

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఎక్కువ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కూతురు ఎంపీ కావ్యను కోరారు. రఘునాథపల్లిలో మంగళవారం ఆయన ఎంపీ కావ్యతో కలిసి రఘునాథపల్లి, లింగాలఘణపురం మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహయ నిధి, విద్యుదాఘాత బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పదిహేనేళ్లుగా వెనుకబడి పోయిందని.. ఇక్కడి ప్రజల తరపున అడుగుతున్నా మండలాల అభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎంపీ కావ్యను కోరారు. భారాస ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకుని ఏమీలేని వాళ్లు రూ.కోట్లు దోచుకున్నారని, ధరణితో వేల ఎకరాల భూములు కాజేశారని తెలిపారు. ఈ నెల 3 నుంచి రేషన్ కార్డులు, కొత్త పింఛన్ల మంజూరుకు అధికారులు ఇంటింటా సర్వే చేయనున్నారని, దసరా నాటికి ఇందిరమ్మ ఇళ్ల జీవో రానుందన్నారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ.. భారాస ప్రభుత్వం తక్కువ అభివృద్ధి చేసి ఎక్కువ ప్రచారం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అనతి కాలంలోనే పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఏసీపీ భీంశర్మ, మండల ప్రత్యేకాధికారి రాజేందర్ రెడ్డి, తహసీల్దార్ మోహిస్సన్, ఎంపీడీవో శ్రీనివాస్, ట్రాన్స్‌కో డీఈలు గణేశ్, లక్ష్మీనారాయణ రెడ్డి, ఏడీఈ అనిల్ కుమార్, ఏఈ రాహుల్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లాలో పేదల తరపున నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన సీపీఎం నాయకులు బొట్ల శ్రీనివాస్ మృతి తీరని లోటని, ఆయన చూపిన స్ఫూర్తితో మరిన్ని ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బొట్ల శ్రీనివాస్ సంస్మరణ సభ జనగామ పట్టణంలోని ధర్మకంచలో మంగళవారం పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. భూపోరాటాలు, ఇళ్ల స్థలాలు, గిరిజనుల సమస్యలపై శ్రీనివాస్ చేసిన పోరాటాలు ఆదర్శనీయంగా నిలుస్తాయన్నారు. సమావేశంలో పార్టీ సిద్దిపేట, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు ఆముదాల మల్లారెడ్డి, బొట్ల చక్రపాణి, సీపీఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, ప్రజా సంఘాల నాయకులు స్కైలాబ్‌బాబు, యాదగిరి, అహల్య, రాపర్తి రాజు, జోగు ప్రకాష్, బూడిద గోపి, విజేందర్, శేఖర్, తదితర నేతలు పాల్గొన్నారు.

పేదల ఇళ్లపై 'హైడ్రా' చర్యలు శోచనీయం..

హైదరాబాద్ మూసీ నది పరిరక్షణ పేరుతో ఏర్పాటైన 'హైడ్రా' చేపడుతున్న కూల్చివేతలు పెద్దలు, స్థిరాస్తి వ్యాపారులు నిర్మించుకున్న భవనాలను వదిలి, పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన ఇళ్లను కూల్చివేయడం శోచనీయమని తమ్మినేని ధ్వజమెత్తారు. కూల్చివేతల వల్ల నష్టపోయే వారికి ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా చర్యలు చేపడితే సీపీఎం తరపున ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అలాగే కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతుందని, జమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను హరిస్తోందని విమర్శించారు.

ప్రజల పక్షాన భారాస నిరంతర పోరాటం



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి, న్యూస్‌టుడే: బాధిత ప్రజల పక్షాన భారాస నిరంతర పోరాటం చేస్తోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గత కేసీఆర్ హయాంలో వ్యవసాయం పండగలా ఉండేదని, అమలు కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ అన్నదాతలను విస్మరించిందని బేషరతుగా క్షమాపణ చెప్పాలని ధ్వజమెత్తారు. మంగళవారం పాలకుర్తిలోని సోమేశ్వరాలయ వేడుకల మందిరంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ కాని కర్షకులతో ఈ నెల 4న మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో 50 వేల మంది అన్నదాతలతో మహాధర్నా కార్యక్రమం చేపడుతున్నామని విజయవంతం చేయాలని కోరారు. పాలకుర్తిలో పార్టీ పూర్వ వైభవానికి కార్యకర్తలు సైనికుడిలా పని చేయాలన్నారు. సమావేశంలో గిరిజన సహకార సంస్థ మాజీ ఛైర్మన్ గాంధీ నాయక్, భారాస మండలాధ్యక్షుడు నవీన్, నాయకులు నాగిరెడ్డి, సుందర్‌రాంరెడ్డి, రామోజీ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు డీఎస్సీలో మెరిశారు!

రఘునాథపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు డీఎస్సీలో అర్హత సాధించారు. ప్రభుత్వం సోమవారం వెల్లడించిన ఫలితాల్లో కుసుంబాయి తండా పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఎస్‌జీటీగా జిల్లా మొదటి స్థానంలో, శివాజీనగర్ కార్యదర్శి వేణు స్కూల్ అసిస్టెంట్‌గా రెండో స్థానంలో నిలిచారు. వెల్ది, పడమటి గూడెం, గోవర్ధనగిరి కార్యదర్శులు సాయిబాబు, సృజల, ప్రదీప్ కూడా ప్రతిభ చూపి ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత పొందారు. డీఎస్సీలో ప్రతిభ చూపిన కార్యదర్శులను మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వెంకటేశ్వర్లు అభినందించారు.

వృద్ధులు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉపన్యసిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, చిత్రంలో డీసీపీ రాజమహేంద్రనాయక్, జడ్పీ సీఈవో సరిత, తదితరులు

జనగామ రూరల్, న్యూస్‌టుడే: సమాజంలో వయో వృద్ధుల సంక్షేమం కోసం రూపొందించిన చట్టాలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని పాలనాధికారి రిజ్వాన్ బాషా తెలిపారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జనగామ మండలం శామీర్‌పేటలోని రుద్రమాదేవి వృద్ధాశ్రమంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలను నిర్వహించగా, ముఖ్య అతిథిలుగా జిల్లా కలెక్టర్, డీసీపీ రాజమహేంద్రనాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ ఆశ్రమం నడుస్తోందని, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించాలన్నారు. ప్రస్తుత కాలంలో అనేక మంది పిల్లలు తమ తల్లిదండ్రుల ఆస్తులను పంచుకుంటున్నారే తప్పా, వారి యోగ క్షేమాలను పట్టించుకోవడం లేదన్నారు. వయో వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007 ప్రకారం పిల్లలు తమ తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవాలన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకురాలు సుగుణమ్మ, డీడబ్ల్యూఓ జయంతి, డీఎంహెచ్ఓ రవీందర్‌గౌడ్, డీఆర్డీవో వసంత, సఖి కేంద్రం సీఏ రేణుక, వయో వృద్ధుల కమిటీ సభ్యులు కన్నా పరశురాములు పాల్గొన్నారు.

సర్దుబాటు చదువులు.. విద్యార్థుల వెతలు!

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చదువులు కొనసాగుతున్నాయి. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియతో కొన్ని బడుల్లో టీచర్ల కొరత నెలకొంది. ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేక, ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నచోట ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉండడంతో బోధన తడబాటుకు గురవుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఒక్కరే 20-30 మందికి పైగా బోధించాల్సిన పరిస్థితి. సర్దుబాటు చేస్తున్నా కొరత వేధిస్తూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యాశాఖ అధికారులు దృష్టిసారించి బోధనకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన అవసరం ఉంది.

372 మందికి.. ఇంకా ముగ్గురు అవసరం



ఇది జనగామ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల. జిల్లా మొత్తంలోనే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న బడిగా ప్రసిద్ధి. ఇందులో 372 మంది విద్యార్థులకు గాను 15 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అయినా బోధనకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇందులో జీహెచ్ఎం పోస్టు ఖాళీగానే ఉంది. హిందీ పండిట్, బయోసైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు ఇద్దరు చొప్పున ఉండాల్సింది. కానీ ఒక్కరొక్కరే ఉన్నారు. విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని సర్దుబాటు చేస్తే బాగుంటుంది.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు : 508
విద్యార్థుల సంఖ్య: 31,110
సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులు: 45-50
సర్దుబాటు చేసిన పాఠశాలలు : 40-45

22 మందికి.. ఒక్కరే



జనగామ మండలంలోని పెద్దరామన్‌చర్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆధారమే ఈ ఉపాధ్యాయుడు. 22 మందికి ఈయనొక్కడే అన్ని సబ్జెక్టులు చెప్పాల్సిన పరిస్థితి. విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ఇద్దరు ఉండాలి. ఏదైనా అవసర నిమిత్తం సెలవు పెట్టుకోలేని పరిస్థితి ఈయనది. బదిలీ కాబడి రిలీవ్ కాని ఉపాధ్యాయులను ముందుగా రిలీవ్ చేసి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే న్యాయం జరుగుతుంది.

సర్దుబాటుతో సరి



జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 96 మంది విద్యార్థులకు గాను ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేది. విద్యార్థుల సంఖ్య ప్రకారం నలుగురు ఉండాలి. కొన్ని రోజుల పాటు ఆ ఇద్దరే పాఠశాలను నడిపించారు. బోధనాపరమైన ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న విద్యాశాఖాధికారులు మరో ఇద్దరు ఉపాధ్యాయులను ఇందులో సర్దుబాటు చేశారు. కానీ జీవో నెంబర్ 25 ప్రకారం ప్రతి తరగతి గదికో ఉపాధ్యాయుడిని నియమిస్తే బాగుంటుందని స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

మూత'బడి'



నర్మెట్ట, తరిగొప్పుల, న్యూస్‌టుడే: ఇది నర్మెట్ట మండలంలోని కపూర్యతండా ప్రాథమిక పాఠశాల. ఈ ఏడాది ఒక్క ప్రవేశం కూడా కాకపోవడంతో ఇక్కడ విధులు నిర్వర్తించే ఉపాధ్యాయురాలిని నర్మెట్ట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు సర్దుబాటు చేశారు. దీంతో ఈ పాఠశాల మూత'బడి'ంది. ● తరిగొప్పుల మండలంలోని వాచ్యతండా గ్రామ పరిధిలోని వెంకటతండా ప్రాథమిక పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడు లేకపోవడంతో సర్దుబాటులో మరో ఉపాధ్యాయుడిని నియమించారు. ●దేవరుప్పుల మండలంలోని పలు పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

చాలావరకు సర్దుబాటు చేశాం..

- రాము, డీఈవో, జనగామ

దేవరుప్పుల మండలంలో మాత్రమే ఎక్కువ కొరత ఉంది. బదిలీల్లో ఈ మండలానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో కొరత ఏర్పడింది. ఎక్కడెక్కడ సర్దుబాటు చేయాల్సి ఉందో ఎంఈవోలు పర్యవేక్షిస్తున్నారు. బోధనపరంగా ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

నిష్పత్తి ఇలా.. విద్యార్థులు	1–10	11–60	61–90	91–120	121–150	151–200
ఉండాల్సిన ఉపాధ్యాయులు	1	2	3	4	5	6

☛ 200 మంది పిల్లలు దాటితే ప్రతి 40 మందికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి.

పండగ వేళ.. ప్రయాణం భారం!

బతుకమ్మ పండగ వచ్చిందంటే ఆడపడుచులు వారి తల్లిగారింటికి బయలుదేరుతారు. పాఠశాలలకు మంగళవారం నుంచి సెలవులు ప్రకటించడంతో పిల్లలతో ఎంత కష్టమైనా సొంతింటికి వెళతారు. ఓరుగల్లు ప్రజలు ఎక్కువగారైళ్లలో ప్రయాణిస్తారు. ఈసారి పండగకు విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయి. మూడోలైను పనుల కారణంగా వరంగల్, కాజీపేట నుంచి వెళ్లే రైళ్లను ఈ నెల 7 వరకు రద్దు చేశారు. ప్రత్యేక రైళ్లను ప్రకటించినా వాటిలో చాలా వరకు రద్దయ్యాయి. దీంతో అందరూ బస్సులనే ఆశ్రయించాల్సి వస్తోంది. బతుకమ్మ, దసరా పండగకు వరంగల్ ఆర్టీసీ అదనపు బస్సులను మంగళవారం నుంచి నడిపిస్తోంది. రైలు ప్రయాణికులంతా వాటినే ఆశ్రయిస్తారు కాబట్టి రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో కొందరు సొంత వాహనాల్లో పయనం కావడానికి సిద్ధమవుతున్నారు. చౌకగా ప్రయాణం చేసే రైళ్లు రద్దు కావడం అందరికీ భారంగా మారింది..

–కాజీపేట, హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే



రైళ్ల రద్దు.. బస్సుల్లో రద్దీ


రైళ్లు రద్దు కావడంతో వెల వెల పోతున్న కాజీపేట రైల్వే స్టేషన్

బస్సు	ఛార్జీల వివరాలు (రూ.)	రైలు
300	వరంగల్-హైదరాబాదుకు	80
275	వరంగల్-ఖమ్మం	75
250	వరంగల్-రామగుండం	70


ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్

అదనపు భారం రూ.2 వేలు

రైళ్లు లేకపోవడంతో ఈసారి బస్సు ప్రయాణం తప్పదు. వాటిలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉన్నా రద్దీని తట్టుకోవడం కష్టం. దీంతో ఛార్జీలు అధికంగా ఉండే డీలక్స్, సూపర్ లగ్జరీ వంటి ఉన్నత స్థాయి బస్సులను ఆశ్రయించాల్సిందే. వాటిలోనూ సీట్లు దొరకడం కష్టం.

ఇదీ పరిస్థితి: ఇంట్లో నలుగురు వ్యక్తులు హైదరాబాద్ నుంచి వరంగల్‌కు ప్రయాణం చేయాలనుకుంటే రైలు ఛార్జీతో పోలిస్తే ఒక్కొక్కరికి బస్సులో రూ.200 నుంచి రూ.225 వరకు ఎక్కువ అవుతుంది. దీనికి తోడు ఆటోలు, ఇతర రవాణా ఛార్జీలు కలుపుకొని కుటుంబానికి రానుపోను రూ.2000 వరకు అదనపు భారం పడుతుంది.

ముందస్తు ప్రయాణం మేలు

పండగకు ముందురోజు కంటే ఒకటి, రెండు రోజుల ముందే ప్రయాణం కడితే కొంత రద్దీని తట్టుకోవచ్చు. చాలా మంది సాయంత్రం విధులు ముగించాక బయలుదేరుతారు. కాస్త ముందుగా బయలుదేరితే ఆర్టీసీకి కాస్త వెసులుబాటు లభిస్తుంది.

● ఇప్పుడు చాలా మందికి కార్లు ఉంటున్నాయి. కాబట్టి కాస్త ఖర్చు ఎక్కువైనా కారు లేదా ఇతర వాహనాలు వాడితే సామాన్య ప్రజలకు బస్సుల్లో కాస్త వెసులుబాటు ఉంటుంది.

బల్లార్ష మార్గంలో బహుకష్టం

బల్లార్ష మార్గంలో పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల ప్రాంతాలకు వెళ్లడానికి రైలు మార్గమే సులువు.. చౌకగా వెళ్లొచ్చు. రైళ్లు రద్దు చేయడంతో కరీంనగర్ మీదుగా బస్సులో వ్యయప్రయాసలతో ప్రయాణించాల్సిందే.

నిండిన బెర్తులు: దసరా పండగకు కోల్‌కతా, ఒడిశా, బెంగళూరు, మైసూరు, తిరుపతి ప్రాంతాలకు ఎక్కువగా వెళుతుంటారు. ఈమార్గంలో రైళ్లకు చాంతాడంత వెయిటింగ్ లిస్టు ఉంది. హౌరా, యశ్వంతాపూర్, పద్మావతి రైళ్లల్లో బెర్తులు లేవని చూపిస్తున్నాయి.

గతేడాది అక్టోబరులో దసరా, బతుకమ్మ పండగ నేపథ్యంలో వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల నుంచి ప్రయాణించినవారి సంఖ్య (రోజుకు సగటున)

మార్గం	ప్రయాణికుల సంఖ్య	సాధారణ రోజుల్లో ప్రయాణికుల సంఖ్య	తేడా
వరంగల్-కాజీపేట- సికింద్రాబాద్	16,000	9,500	6,500
కాజీపేట-వరంగల్- ఖమ్మం	13,000	8,500	4,500
కాజీపేట - వరంగల్- బల్లార్ష	15,000	6,500	7,500

ప్రైవేటు వాహనాలకు గిరాకీ



ప్రైవేటు వాహనాలకు గిరాకీ బాగా పెరిగింది. ఇప్పటికే వరంగల్‌లోని ట్రావెల్స్‌ల్లో ఉన్న నాలుగు చక్రాల వాహనాలు బతుకమ్మకు ముందు రోజున బుక్ అయ్యాయి. డిమాండ్ పెరగడంతో ఆ రోజు ప్రయాణానికి అదనంగా వసూలు చేయనున్నారు.

నేటి నుంచి 850 అదనపు బస్సులు..

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: వరంగల్ రీజియన్‌లో 850 బస్సులను (ట్రిప్పులు) నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఎక్కువగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలకు తిరుగుతాయి. దూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులను ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఈ నెల 2 నుంచి 8 వరకు ఇవి నడుస్తాయి. పండగ అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా 13, 14, 15 తేదీల్లో రద్దీకి అనుగుణంగా ఆయా డిపోల నుంచి హైదరాబాద్‌కు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు సైతం బస్సులు నడపనున్నారు. సాధారణ ఛార్జీలే వసూలు చేస్తామని అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకం అమలులో ఉండటంతో గతేడాది కంటే అదనంగా బస్సులను నడిపిస్తున్నామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు.

● హనుమకొండ బస్టాండు నుంచి హైదరాబాద్ రూట్లో నిత్యం 250 బస్సులు నడుస్తుంటాయి..దాదాపు 400 ట్రిప్పులు. పండగ సందర్భంగా అదనంగా 150 బస్సులు నడిపిస్తారు.. ● ఖమ్మం, మహబూబాబాద్ రూట్లలో వరంగల్ రీజియన్ నుంచి హనుమకొండ, మహబూబాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు నడుస్తాయి. 25 బస్సులు ఖమ్మం వరకు ఉంటాయి. మహబూబాబాద్ నుంచి ఖమ్మం వరకు మరికొన్ని బస్సులు నిత్యం నడుస్తాయి. ఈ మార్గంలో అదనంగా మరో 50 బస్సులను పెంచనున్నారు.

డిపోల వారీగా నడిపే ప్రత్యేక బస్సులు

డిపో	బస్సులు
వరంగల్-1	125
వరంగల్-2	125
హనుమకొండ	125
పరకాల	93
నర్సంపేట	119
జనగామ	120
తొర్రూరు	48
మహబూబాబాద్	47
భూపాలపల్లి	48

ట్రిప్పుల సంఖ్య పెంచాలి..

-మాడిశెట్టి చంద్రశేఖర్, హనుమకొండ



గతంలో రైళ్లలో ప్రయాణించేవాళ్లం.. ఈసారి అవి రద్దయ్యాయి. దీనితో బస్సుల్లో రద్దీ పెరిగే అవకాశం ఉంది. రైళ్లు నడిచే మార్గంలో ఆర్టీసీ బస్సులు ఎక్కువగా నడిపించాలి. ట్రిప్పుల సంఖ్య పెంచాలి. రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయాలి.

అదనపు భారం

-గద్దల సతీష్, ప్రయాణికుడు



మా స్వగ్రామం మంచిర్యాల దేవనూరు. మా బంధువులు అంతా అక్కడే ఉంటారు. మేము హనుమకొండకు వచ్చి దాదాపు 15 ఏళ్లు అవుతోంది. అప్పుడప్పుడు మా గ్రామానికి వెళ్లి వస్తుంటాం. ఈ ఏడాది దసరాకు వెళ్దామని అన్నీ సిద్ధం చేసుకున్నాం. ఇంతలోనే రైళ్లు రద్దు అని చెబుతున్నారు. బస్సులో వెళ్తే ప్రయాణ భారంతో పాటు సమయం ఎక్కువగా తీసుకుంటుంది. ఈ సమయంలో రైళ్లు రద్దు చేయడం సరికాదు.. పండగలు ముగిసిన తర్వాత ఆ నిర్ణయం తీసుకుంటే బాగుండేది

రేపటి నుంచి శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రులు

● 10న సద్దుల బతుకమ్మ.. 12న దసరా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు

రంగంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రులు ఈ నెల 3వ తేదీ నుంచి 13 వరకు వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు కార్యనిర్వహణ అధికారిణి శేషుభారతి, ప్రధానార్చకుడు శేషు వెల్లడించారు. 10న మహానవమి(దుర్గాష్టమి) శ్రీభద్రకాళి జన్మోత్సవం, సద్దుల బతుకమ్మ, 12న విజయదశమి(దసరా) ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఉత్సవాల వివరాలు వెల్లడించారు. శ్రీదేవి శరన్నవరాత్రులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని, తొమ్మిది రోజులపాటు తొమ్మిది రూపాల్లో అమ్మవారిని సుందరంగా అలంకరిస్తారని, ఉదయం, సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులకు వాహన సేవలుంటాయన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, చింత శ్యాంసుందర్, అర్చకుడు గండికోట రాము తదితరులు పాల్గొన్నారు.

రోజు వారీగా కార్యక్రమాలు..

- 2న ఉదయం హరిద్రాదర్శనం శరన్నవరాత్రయాగ పూర్వాంగనిధి, సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ
- 3న భేరి పూజ, ధ్వజారోహణం, కలశ స్థాపన, అమ్మవారిని శైలపుత్రిక్రమము బాలా త్రిపురసుందరి అలంకరణ, ఉదయం 11 గంటలకు వృషభ వాహనసేవ, సాయంత్రం మృగ(జింక) వాహనసేవ
- 4న అన్నపూర్ణాలంకారం, బ్రహ్మచారిణి దుర్గార్చన, మకర, చంద్రప్రభ వాహనసేవలు
- 5న గాయత్రి అలంకరణ, చంద్రఘంటా దుర్గార్చన, సింహ, గజ వాహనసేవలు
- 6న శ్రీమహాలక్ష్మి అలంకరణ, కూష్మాండీ దుర్గార్చన, సూర్యప్రభ, హంస వాహనసేవలు
- 7న లలితా పంచమి శ్రీరాజరాజేశ్వరి లలితా మహాత్రిపుర సుందరి, స్కందామాత దుర్గార్చన, పల్లకీ సేవ, శేషవాహన సేవ
- 8న భవాని అలంకరణ, కాత్యాయని దుర్గార్చన, గంధోత్సవం, చాముండ దుర్గార్చన, సాలభంజిక సేవ
- 9న శ్రీ సరస్వతీమాత, కాళరాత్రి దుర్గార్చన, రాత్రి అమ్మవారికి రథోత్సవం
- 10న మహాష్టమి(దుర్గాష్టమి) శ్రీభద్రకాళి అమ్మవారి జన్మోత్సవం, మహా దుర్గా అలంకారం, మహా గౌరి దుర్గార్చన, భద్రపీఠ సేవ, అశ్వవాహన సేవ, సద్దుల బతుకమ్మ
- 11న మహా నవమి మహిషమర్దిని అలంకరణ, శంభు దుర్గార్చన, వసంతోత్సవం, మహా పూర్ణాహుతి, సాయంత్రం సర్వభూపాల వాహనసేవ
- 12న విజయ దశమి, శమీ పూజ, శ్రీభద్రకాళి అమ్మవారికి మహా పట్టాభిషేకం, నిజరూప దర్శనం, రాత్రి భద్రకాళి చెరువు(తటాకంలో)లో శ్రీభద్రకాళి భద్రేశ్వరులకు తెప్పోత్సవం
- 13న సాయంత్రం శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణం.

రూపుదిద్దుకుంటున్న కాజీపేట వంతెన

ఈనాడు, వరంగల్, కాజీపేట, న్యూస్‌టుడే

● రాయ్‌పూర్‌లో సిద్ధమవుతున్న 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'

- శంకుస్థాపన - 2017
- టెండర్లు పిలిచింది - 2019
- పూర్తి కావాల్సింది - 2020
- పనులు ప్రారంభమైంది - 2021
- మొత్తం అంచనా వ్యయం - రూ.45 కోట్లు
- 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' భాగం నిర్మాణానికి - రూ.20 కోట్లు
- వెడల్పు - 9.5 మీటర్లు
- ఎడమవైపు పాదచారుల దారి - 1.5 మీటర్లు.


తయారీ దశలో 'బౌ స్ట్రింగ్ ఆర్చ్'

కాజీపేట వద్ద నిర్మాణంలో ఉన్న రెండో ఆర్వోబీపై బిగించేందుకు ఉక్కుతో తయారు చేస్తున్న 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో సిద్ధమవుతోంది. నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈనెలాఖరుకు విడిభాగాలు ఇక్కడకు తీసుకొస్తారు. విల్లు ఆకారంలో ఉక్కుతో ఉన్న ఈ భాగాన్ని రైల్వే పట్టాలపై నిపుణులు బిగించనున్నారు. రాష్ట్రంలో ఇలాంటి తరహా వంతెన ఇప్పటి వరకు ఎక్కడా లేదని.. కాజీపేటపై రెండో ఆర్వోబీపై వచ్చేది మొదటిది అని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

మరో రూ.16 కోట్లు విడుదల చేయాలి

ఈ వంతెనను వేంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్ అనే గుత్తేదారు సంస్థ నిర్మిస్తోంది. ఈ సంస్థకు ప్రభుత్వం ఇంకా రూ.16 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులతో సమీక్షించి ఈ నిధులను వెంటనే విడుదల చేయాలని చెప్పారు. మూడు నెలలు గడుస్తున్నా నిధులు ఇంకా గుత్తేదారుకు అందలేదని, అందుకే వంతెన నిర్మాణం నిలిచిపోయినట్టు సమాచారం. ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి నిధులను వెంటనే విడుదల చేస్తే పనులు వేగంగా పూర్తవుతాయి.

విల్లు ఆకారమే ప్రత్యేకం

కాజీపేటలో ఉన్న పాత ఆర్వోబీకి కొత్త వంతెన పూర్తి భిన్నంగా ఉంటుంది. దీన్ని 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' గా పిలుస్తారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. రైళ్ల రాకపోకలకు ఏమాత్రం అంతరాయం లేకుండా వంతెన నిర్మాణాన్ని కొనసాగించేందుకు ముందే సిద్ధం చేసిన 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' ను వంతెనపై బిగించనున్నారు. వంతెనను 21 స్తంభాలతో నిర్మిస్తుండగా, ఇందులో రైల్వే లైన్ల పైభాగంలో మాత్రం విల్లు ఆకారంలో ఉండే నిర్మాణం మొత్తం ఉక్కు మిశ్రమంతో ఉంటుంది. దీనికి ఆధారంగా మూడు పిల్లర్లు ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. రైల్వే పట్టాలపై 800 టన్నుల బరువుతో 250 అడుగుల పొడవుతో రెండు భాగాలు ఉంటాయి. అంటే మొత్తం 1600 టన్నుల బరువు, 500 అడుగుల పొడవుతో 'బౌ స్ట్రింగ్ ఆర్చ్' భాగాలను రాయ్‌పూర్‌లో సిద్ధం చేస్తున్నారు. ఇటీవలే మన ఇంజినీర్లు అక్కడికి వెళ్లి దాన్ని పరిశీలించారు. 'ఈనాడు' ఆ చిత్రాలను ప్రత్యేకంగా సంపాదించింది. ప్రస్తుతం ఉన్న వంతెన కన్నా కొత్త వంతెన ఎక్కువ ఎత్తుతో ఉండనుంది.



కేయూలో విజిలెన్స్ విచారణ


కేయూ అధికారులను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

విద్యానగర్,న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి టి.రమేష్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ ఎ.బాలకోటి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్‌లు జి.రాకేష్, బి.అనిల్, హన్నన్, ఎఫ్ఆర్ఓ గౌతమ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిప్రసాద్ తదితరులు కేయూకు వచ్చారు. రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, పరీక్షల నియంత్రణ అధికారులను విచారించారు. ప్రొఫెసర్లను సీనియర్ ప్రొఫెసర్లుగా ఏ విధంగా పదోన్నతి కల్పించారు.. సెలక్షన్ కమిటీ ఆమోద పత్రాలు, ఈసీ మినిట్స్, 2022లో పీహెచ్‌డీ ప్రవేశాలు ఎలా భర్తీ చేశారు.. తదితర అంశాలపై విచారించి, వాటికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడిగిన వివిధ పత్రాలు సమర్పించడంలో వర్సిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, రెండు మూడు సార్లు నోటీసులు పంపించినా వాటికి ఎలాంటి సమాధానాలు రాక పోవడంతోనే నేరుగా విచారణకు వచ్చినట్లు సమాచారం.

భారీ బతుకమ్మకు అంతర్జాతీయ రికార్డు


జనగామలోని నెహ్రూపార్కు సెయింట్‌మేరీస్ ఉన్నత పాఠశాలలో 36.2 అడుగుల భారీ బతుకమ్మ

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద ఉన్న సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. సంబరాల్లో భాగంగా 36.2 అడుగుల బతుకమ్మను తయారు చేసి ప్రపంచంలోకెల్లా అతిపెద్ద బతుకమ్మగా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకుంది. స్టీల్, వైబ్రెంట్ ఆర్టిఫిషియల్ ఫ్లవర్స్‌తో 700 మంది విద్యార్థులు, 30 మంది ఉపాధ్యాయులు కలిసి 24 గంటలలోపు దీన్ని తయారు చేశారు. ఇంతకు ముందు ఉన్న 31 అడుగుల బతుకమ్మ రికార్డును అధిగమించినందున ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు నరేందర్‌గౌడ్, సుభాషిని.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసాని శ్రీధర్‌కు సదరు రికార్డు ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు.



ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ధ్రువీకరణపత్రం

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	110
రిటైల్:	132
డ్రెస్డ్:	191
స్కిన్‌లెస్:	218

నఖ చిత్ర కళలో దిట్ట



దళసరి కాగితాలే క్యాన్వాస్‌గా వేలి గోర్లే కుంచెగా చేసుకుని అద్భుత కళాఖండాలు చిత్రీకరిస్తూ అబ్బురపరుస్తున్నారు నర్సంపేటకు చెందిన కళాకారుడు మండ వీరస్వామి. కవి, గేయరచయిత, గాయకుడు, చిత్రకారుడు, రంగస్థల నటుడిగానే గాక చిత్రలేఖనంలో చేయి తిరిగిన చిత్రకారుడు కూడా. చిత్రలేఖనంలో పట్టున్న ఆయన దళసరి కాగితాలపై నఖ(గోటి)తో మహాత్మాగాంధీ, మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం, మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావు తదితరుల చిత్రాలు గీసి అబ్బురపరుస్తున్నారు. –న్యూస్‌టుడే, నర్సంపేట

5న ఉద్యోగ మేళా

కొత్తవాడ, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న వరంగల్ ములుగురోడ్డులోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో చెన్నైలోని హిందూస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్‌లో 100 ఉద్యోగ ఖాళీలకు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. ఇంటర్‌లో 75శాతం మార్కులు వచ్చి, 18 నుంచి 22 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబరు 75691 77071 సంప్రదించాలన్నారు.

చారిత్రక ప్రాంతాల సందర్శనే లక్ష్యం


బ్రోచర్ విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ జీఎం కిషోర్, ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగర్ తదితరులు

కాజీపేట, న్యూస్‌టుడే: రైలు ప్రయాణికులకు చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించపజేయడమే లక్ష్యంగా ఐఆర్‌సీటీసీ పని చేస్తుందని సంస్థ జనరల్ మేనేజర్ కిషోర్, టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ అన్నారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం భారత్ గౌరవ్ యాత్ర ప్రత్యేక పర్యాటక రైలుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. స్థానిక టూరిజం ఏజెంట్లకు దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారత్ గౌరవ్ యాత్ర మొత్తం 8 రాత్రులు, 9 పగళ్లు ఉంటుందని చెప్పారు. నవంబరు 6న సికింద్రాబాద్ నుంచి ఈ రైలు ప్రారంభమౌతుందని తెలిపారు. ఈ యాత్రలో రామేశ్వరం, అరుణాచలం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు తదితర సందర్శన ప్రదేశాలుంటాయన్నారు. ఆసక్తి ఉన్న ప్రయాణికులు వివరాలకు 92810 30749, 92810 30750 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

6న ఎన్‌ఎల్‌ఎం బృందం రాక


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: ఈ నెల 6న కేరళ నుంచి నేషనల్ లెవల్ మానిటరింగ్(ఎన్‌ఎల్‌ఎం) టీం జిల్లాలో పర్యటించనుందని కలెక్టర్ రిజ్వాన్‌బాషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి జిల్లాలో ఎన్‌ఎల్‌ఎం బృందం పర్యటనపై సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ.. ఆ బృందం గ్రామీణాభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించనున్నట్లు చెప్పారు. దేవరుప్పుల, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, కొడకండ్ల మండలానికో ఐదు గ్రామాలను బృందం సందర్శిస్తుందన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు యాక్షన్‌ప్లాన్ రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో వసంత, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, డీపీవో స్వరూప, జడ్పీ సీఈవో సరిత, పీఆర్‌ఈఈ శ్రీనివాసరావు, హౌజింగ్ ఈఈ దామోదర్‌రావు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి..

జనగామ అర్బన్: ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ రిజ్వాన్‌బాషా బ్యాంకర్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేటులో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి రుణాల మంజూరు, రుణాల రెన్యూవల్, తదితర అంశాలపై బ్యాంకర్లతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించి, ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆర్బీఐ ఏజీఎం శ్రావ్య, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, ఎల్డీఎం శ్రీధర్, డీఏవో రామారావు నాయక్, డీఆర్డీవో వసంత, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు


పట్టణంలోని సెయింట్‌పాల్స్ ఉన్నత పాఠశాలలో


నాంచారిమడూరులో..


లింగాలఘనపురం: వనపర్తి పీవీఆర్ పాఠశాలలో..

న్యూస్‌టుడే, బృందం: బతుకమ్మ పండగ, దసరా సెలవులు బుధవారం నుంచి ప్రారంభం కానుడటంతో జిల్లాలోని పలు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, ఆడి పాడారు. కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పండగ నేపథ్యంలో జనగామ పట్టణంలో ప్రయాణికుల రద్దీ, పువ్వుల కొనుగోళ్లతో రోడ్లంతా కిక్కిరిసిపోయాయి.


జనగామ: ఎస్వీఆర్ పాఠశాలలో..


దేవరుప్పులలో..


తరిగొప్పుల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో..

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఒడ్డెర కాలనీలో నివాస సముదాయాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో దోమలు, ఈగలు బెడద అధికమవుతోంది. **- కాలనీ వాసులు**

సమాధానం: పరిశీలించి, సిబ్బందితో తొలగింపజేయిస్తాం. **- నర్సింహ్మాచారి, పంచాయతీ కార్యదర్శి**

దేవరుప్పుల: మండలంలోని మాధాపురంలో గతంలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- రమేశ్, గ్రామస్థుడు**

సమాధానం: కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. **- యాకన్న, పంచాయతీ కార్యదర్శి**

దేవరుప్పుల: కామారెడ్డిగూడెం పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. చర్యలు తీసుకోవాలి. **- స్థానికులు**

సమాధానం: పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తాం. **- స్వప్న, పంచాయతీ కార్యదర్శి**

తరిగొప్పుల: మండలంలోని అబ్దుల్‌నాగారం నాలుగో వార్డు మురుగుకాల్వ వ్యర్థాలతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. పరిష్కరించాలి. **-కాలనీవాసులు**

సమాధానం: రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. **- రవీందర్, పంచాయతీ కార్యదర్శి**

కొడకండ్ల: మండలంలోని నర్సింగాపురం గ్రామ శివారులో ఓ లారీ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో సరఫరా నిలిచిపోయింది. మరమ్మతు చేయాలి. **- ఎన్.మురళి, నర్సింగాపురం**

సమాధానం: పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాము. రెండు రోజుల్లో సరఫరా పునరుద్ధరిస్తాం. **- రాములు, ఏఈ**

తరిగొప్పుల: జాలుబాయితండా గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఇళ్లలోకి దోమలు సంచరిస్తున్నాయి. వ్యాప్తిని అరికట్టాలి. **- స్థానికులు**

సమాధానం: రెండు రోజుల్లో పిచ్చి మొక్కలు తొలగిస్తాం. **- రాజేందర్, పంచాయతీ కార్యదర్శి**

జనగామ, న్యూస్‌టుడే: స్థానిక రుద్రమ దేవి మహిళా సొసైటీ భవనం సమీపంలోని వీధిలో స్తంభాలకు దీపాలు వెలగడం లేదు. గత నాలుగైదు రోజులుగా సమస్య ఉంది. **- ఉపేందర్‌యాదవ్, శ్రీరామనగర్ బీరప్పగుడి రోడ్**

● 26వ వార్డులోనూ వీధి దీపాలు వెలగడం లేదు.

సమాధానం: ఈ విషయమై బాధ్యులను నియమించి, అన్ని లైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాము. **- మహిపాల్, మున్సిపల్ ఇంజినీర్.**

లింగాలఘనపురం: నెల్లుట్ల చెరువు వంతెనపై విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. **- సర్దార్ అతహార్, గ్రామస్థుడు.**

సమాధానం: పరిశీలించి సంబంధిత అధికారులకు సమస్యను వివరించి పరిష్కరిస్తాం. **- శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, నెల్లుట్ల**

వీధి దీపాలు వెలిగాయి

స్పందనకు వందనం

పాలకుర్తి: మండలంలోని వావిలాలలో పలు వీధుల్లో స్తంభాలకు దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి అనిల్ స్పందించి, సిబ్బందితో దీపాలకు మరమ్మతు చేయించారు.

పిచ్చి మొక్కల తొలగింపు

పాలకుర్తి: మండల కేంద్రంలోని డివైడర్ల నడుమ ఉన్న చెట్ల మధ్య పిచ్చిమొక్కలు పెరిగాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరచారి స్పందించి, సిబ్బందితో తొలగింపజేయించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

పాలకుర్తి, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాల సాధికారితే భాజపా లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుపై మంగళవారం పాలకుర్తి ముఖ్య నేతలతో నియోజకవర్గ కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి వార్డు నుంచి కనీసం 200 సభ్యత్వాల నమోదే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. అలాగే రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్రణాళిక రచించుకొని ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌ఛార్జి కడకంచి రమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


బోల్తా పడిన లారీని తొలగిస్తున్న పోలీసులు

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలంలోని గూడూరు శివారులో ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడటంతో ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ లారీ గృహ నిర్మాణ సామగ్రితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు వెళ్తోంది. ఈ క్రమంలో గూడూరు శివారు రోడ్డు మూల మలుపు వద్ద ఆకస్మాత్తుగా దూసుకొచ్చింది. వ్యవసాయ పనులకు వెళ్తున్న ముగ్గురిని ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో గౌరమ్మ, రమ, రమ్యకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఏసీపీ నర్సయ్య, సీఐ జేసీబీ సాయంతో ఆ వాహనాన్ని తొలగించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఉత్తమ అధికారులకు ప్రశంసాపత్రాలు



జనగామ టౌన్, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న అన్ని స్థాయిల్లోని అధికారులు, ఉద్యోగులకు ప్రతి నెలా టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందజేస్తున్నారు. జిల్లాలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన పలువురు ఉద్యోగులకు మంగళవారం డీఈ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీజీఎన్పీడీసీఎల్ డైరెక్టర్(ప్రాజెక్ట్స్) సదర్‌లాల్, జనగామ సర్కిల్ ఎస్ఈ వేణుమాధవ్ ప్రశంసాపత్రాలు అందించారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో జనగామ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఏడీఈలు వేణుగోపాల్, బాలగంగాధర్‌తిలక్, ఏఈ రాజ్‌కుమార్, రఘునాథపల్లి ఏడీఈ మనోహర్‌రెడ్డి, ఏఈలు మధు, నర్సింహులు, నరసింహారెడ్డి, రవీందర్, రణధీర్, కనకయ్య తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సహకారంతో బడుల బలోపేతం


డీఈవో రామును సన్మానిస్తున్న ప్రొఫెసర్ వెంకటరాజయ్య, తదితరులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు జిల్లా విద్యాధికారి కె.రాము అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాలను పురస్కరించుకుని అరబిందో మదర్ యోగా సంస్థ ఆధ్వర్యంలో డీఈవో రాము, పలువురు ఎంఈవోలు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, పలువురు ఉద్యోగులను పట్టణంలోని కెమిస్ట్ భవనలో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ తాటికొండ వెంకటరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు వివరాల నమోదు

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఎస్సీ పోస్టుమెట్రిక్ ఉపకార వేతనానికి అర్హత కలిగిన విద్యార్థులు ఈ-పాస్ వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి బి.విక్రమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేరులో ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే ఎస్సెస్సీలో ఉన్న విధంగా ఆధార్‌కార్డులోనూ మార్పు చేసుకోవాలని సూచించారు. ఎస్సెస్సీ ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డులోని వ్యక్తిగత వివరాలు ఒకేవిధంగా ఉంటే ఆ విద్యార్థికి ఒక నెంబర్ గుర్తింపు జనరేట్ అవుతుందని, ఆ నెంబర్‌తో మీసేవలో బయోమెట్రిక్ వివరాలు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు.

తాగునీటి లోపాలను నివారిద్దాం..

జనగామ రూరల్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లోపాలను నివారించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయడం ద్వారానే సాధ్యపడుతుందని నీటి క్వాలిటీ కంట్రోల్ అధికారిణి బాలమణి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేయబడిన తాగునీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి మిషన్ భగీరథ ఏఈ ప్రేమలత అధ్యక్షత వహించగా, ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంపత్‌కుమార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి


గుర్తింపు కార్డులు అందిస్తున్న వెంకటమల్లయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమల్లయ్య అన్నారు. మండలంలోని నమిలిగొండ గ్రామంలో గీత కార్మికులకు మంగళవారం ఎక్సైజ్ శాఖ ద్వారా మంజూరైన నూతన సభ్యత్వాలు, గుర్తింపు కార్డులను అందించారు. వెంకటమల్లయ్య మాట్లాడుతూ.. గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఆర్థికంగా అదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, మండలాధ్యక్షుడు రఘురాములు, సంఘం సభ్యులు పులి యాకయ్య, సత్యనారాయణ, తిరుపతి, యాదగిరి తదితరులు పాల్గొరన్నారు.

వెంకన్న ఆలయంలో పూజలు


వెంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

చిల్పూర్: మండల కేంద్రంలోని చిల్పూర్‌గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అర్చకులు స్వామివారికి బంగారు పద్మాలతో అష్టాదళ పాదపద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈవో మోహన్, అర్చకులు రవీందర్‌శర్మ, సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నాటక సమాజ సమాఖ్య ఎన్నిక

లింగాలఘనపురం : తెలంగాణ రాష్ట్ర నాటక సమాజ సమాఖ్య జిల్లా కమిటీ నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆకుల సదానందం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారడోజు సదానందచారి, గూడూరు బాలాజీ ఆధ్వర్యంలో నెల్లుట్ల ఫౌండేషన్ గృహంలో నిర్వహించారు. కమిటీ ముఖ్య సలహాదారుగా కొత్త వెంకట్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు రవీందర్‌రావు, కన్వీనర్ వైకుంఠం అధ్యక్షుడిగా రవీందర్, ముఖ్య కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి పాపయ్య, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులను ప్రకటించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



స్టేషన్‌ఘన్‌పూర్: చిల్పూర్ మండలంలోని రాజవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎడ్ల సింధు, ఘన్‌పూర్ మండల కేంద్రంలోని హోలీ క్రాస్ పాఠశాలకు చెందిన హర్షవర్ధన్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి కుమార్ మంగళవారం తెలిపారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1 వరకు బీహార్ రాష్ట్రంలోని గయా పట్టణంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

● మండలంలోని పల్లగుట్ట గ్రామ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న సుశాంత్ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేతిడి నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్లులో జరిగిన జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వరలక్ష్మీ, పీఈటీ అనిత మంగళవారం తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

జఫర్‌గఢ్: తిడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సుధాకర్ మంగళవారం విద్యార్థులకు రూ.25 వేల విలువ గల క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎంఈవో పర్వేజ్ పాల్గొని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సదానందం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగడి వేలం వాయిదా

లింగాలఘనపురం: నవాబుపేట కోదండ రామస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహించే పశువుల వారాంతపు సంతలో రహదారి రుసుం వసూళ్ల హక్కు కోసం మంగళవారం నిర్వహించిన వేలం పాట వాయిదా అక్టోబర్ 16 కు వాయిదా వేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు సీహెచ్.రాజేందర్‌రెడ్డి, అశోక్, రవితేజ, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో ప్రమాదం

రఘునాథపల్లి : మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనం అవుతుందని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని వెల్ది మోడల్ స్కూల్‌లో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ గేమ్‌లు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై డి.నరేశ్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

జఫర్‌గఢ్: గంజాయి తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు జఫర్‌గఢ్ ఎస్సై బానోతు రామ్‌చరణ్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. తమ్మడపల్లి(ఐ)కి చెందిన రడపాక దివాకర్ ఎండు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో మండలంలోని సాగరం క్రాస్ రోడ్డు వద్ద తనిఖీ చేసి పట్టుకున్నారు. 250 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు ఎస్సై చెప్పారు. గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, చరవాణి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు

బోరు మోటార్ల తీగల చోరీ

రఘునాథపల్లి: గోవర్ధనగిరిలో రైతుల వ్యవసాయ బోరు మోటార్ల తీగలను ఎత్తుకెళ్లారు. బాధిత రైతుల కథనం ప్రకారం.. బోరు బావుల విద్యుత్తు తీగలను సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వాటిని కాల్చి అందులో కాపర్ తీగను అపహరించారు. పంట పెట్టుబడికి డబ్బులు లేక అవస్థలు పడుతుంటే.. ఇలా నష్ట పోయామని రైతులు శంకరి అశోక్, సంపతి మల్లారెడ్డి, మల్లారెడ్డి, యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు.

పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ తొలగింపు నిలుపుదల

రఘునాథపల్లి: అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే అభియోగంపై మండలంలోని కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఛైర్మన్ చీమలపాటి రవీందర్‌పై జిల్లా సహకార అధికారి వై.రాజేందర్ రెడ్డి ఇటీవల అనర్హత వేటు వేసిన నేపథ్యంలో ఆ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. వరంగల్ కో ఆపరేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడం, అనర్హత వేటు సరైంది కాదని అతడి పిటిషన్ వేసిన అంశాల పరిశీలన మేరకు స్టే ఇచ్చినట్లు హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఎస్‌జీటీలో మూడో ర్యాంక్


తిరుపతి

స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని రైల్వే కాలనీకి చెందిన పసుల తిరుపతి ప్రతిభ కనబరిచారు. ఎస్‌జీటీ విభాగంలో 77.23 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న తిరుపతి మొదటి ప్రయత్నంలోనే ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

సెలవుల్లో పాఠశాలలు నడిపితే చర్యలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎంఈవో జి.కొమురయ్య తెలిపారు. మంగళవారం విద్యా వనరుల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు.

బాధిత కుటుంబానికి కొమ్మూరి పరామర్శ

నర్మెట్ట, న్యూస్‌టుడే: మండలంలోని కన్నెబోయినగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పొన్నబోయిన బాల నర్సయ్య(55) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు, స్వగ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నాయకులు నాగపురి కిరణ్‌కుమార్, గంగం నర్సింహారెడ్డిలు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

మహిళా ప్రయాణికులకు బహుమతులు


ప్రయాణికుల సమక్షంలో లక్కీడిప్ నిర్వహిస్తున్న డీఎం స్వాతి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి బహుమతులు అందిస్తున్నట్లు జనగామ డిపో మేనేజర్ ఎస్.స్వాతి తెలిపారు. డిపో పరిధిలో గత 15 రోజులుగా డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు సంబంధించిన టికెట్లను మంగళవారం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో లక్కీడిప్ తీశారు. మొదటి, రెండో బహుమతులు జనగామకు చెందిన సరస్వతి, కె.వి.లక్ష్మి, బచ్చన్నపేట మండలం ఆలింపురం గ్రామానికి చెందిన రాజేశ్వరి మూడో బహుమతిని గెలుచుకున్నారు. వాటిని త్వరలో వారికి అందించనున్నట్లు డీఎం చెప్పారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ యాదమణిరావు, ఉద్యోగులు యాకయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

'లక్ష్య' క్రీడాకారుడికి తృతీయ బహుమతి


క్రీడాకారుడు ఉదయ్‌కుమార్, కోచ్ రంజిత్‌కుమార్

జనగామ, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన 5కే రన్‌లో 'ఈనాడు' లక్ష్య జనగామ క్రీడకారుడు ఉదయ్‌కుమార్ ఉత్తమ ప్రతిభను ప్రదర్శించాడు. ఈ పోటీలో మూడో స్థానంలో నిలిచి ప్రశంసా పత్రాన్ని, రూ.15వేల నగదు బహుమతిని అందుకున్నాడని లక్ష్య కోచ్ తూడి రంజిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఇతరులు ఉదయ్‌కుమార్‌ను అభినందించారు.

సంక్షిప్తంగా

రక్తదానం.. ప్రాణదానం

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఆరోగ్యవంతులుగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తరచుగా రక్తదానం చేయాలని జనగామ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దుగ్యాల గోపాల్‌రావు అన్నారు. జిల్లా జనరల్ ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. రక్తదానం చేయడంలో అపోహలు వీడాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సంగీత, అన్వర్, అశోక్‌కుమార్, రెడ్‌క్రాస్, ఐఎంఏ, లయన్స్ క్లబ్‌లకు చెందిన కన్నా పరశురాములు, లవకుమార్‌రెడ్డి, కృష్ణజీవన్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో మెరుగైన జీవితం

బచ్చన్నపేట: పిల్లల్లో పోషకాహారలోపం తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీవో రమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని నక్కవానిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు, సిబ్బందితో సీడీపీవో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత పాల్గొన్నారు.

ఫలితాల్లో ప్రతిభ చాటాలి

కొడకండ్ల: గత ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించిన కొడకండ్ల కళాశాల విద్యార్థులు ఈ సారి ప్రథమ ర్యాంకు సాధించాలని ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రావు కోరారు. మంగళవారం కళాశాలలో విద్యార్థులు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పలువురు అధ్యాపకులు ధర్మేంద్ర, బాబురావు, మండల విద్యాధికారి కేజియారాణి పాల్గొన్నారు. విద్యార్థులు ఆట, పాటలతో అలరించారు.

కళా సంపదను పరిరక్షించుకోవాలి



నర్మెట్ట: సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ కళా సంపదను కాపాడుకుంటూ ఆలయాలను పరిరక్షిస్తూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వేద పండితులు ప్రవచన కర్త బ్రహ్మశ్రీ పురాణ మహేశ్వర శర్మ అన్నారు. మంగళవారం నర్మెట్టలోని కాకతీయుల కాలంనాటి పురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకోగా స్థానికుడు గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్థులతో కలిసి పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఆయన ఆలయాన్ని పరిశీలించి కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కులపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.